www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

మున్నూరు కాపు కార్పొరేషన్ కు రూ. 5 వేల కోట్లు కేటాయించాలి



4 లో..

ఖమ్మానికి ఆధ్యాత్మిక వైభవం.. శ్రీవారి ఆలయానికి శ్రీకారం!



4 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 253, మంగళవారం 13-10-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

ఈడీ, సీబీఐ సరిపోక

ఈసీని వాడు కుంటున్నారు

దేశంలో రెండు వర్గాలను సృష్టించిన బిజెపి

కార్పొరేట్లు ధనవంతులు ఓవర్గం కాగా పేదలు గిరిజనులను బిజెపి వ్యతిరేకులుగా పరిగణిస్తున్న కేంద్రం

బిజెపి దర్శకత్వంలో సీఇసీ తప్పులు చేయకపోతే, జ్ఞానేశ్ రాజీనామాలు కోరండి

ఈసీలోని ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారు.

న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం



న్యూఢిల్లీ, అక్టోబర్ 12:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు.ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.



సుప్రీంకోర్టుకు ఇండీ కూటమి నేతల

భారీ ర్యాలీ

సీఈసీని తొలగించాలని కేరళ కాంగ్రెస్ అసెంబ్లీలో తీర్మానం

సీఈసీ పై ఆరోపణలను పిటిషన్ వేస్తే విచారణ చేపడతామని హామీ

రాహుల్ గాంధీ తరపున పిటిషన్ సమర్పించిన న్యాయవాదులు

కూటమి నేతలను కలిసేందుకు... సుప్రీం సీజేఐ నిరాకరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ విపక్ష ఇండియా కూటమి దిల్లీలో చేపట్టిన 'ఓట్ చోర్ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్ తదితర అగ్రనేతల నేతృత్వంలో వేలాది మంది కార్యకర్తలు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ నుంచి సుప్రీంకోర్టు వైపు సాగిన ఈ నిరసన ప్రదర్శనను భగవాన్ దాస్ రోడ్డు వద్ద పోలీసులు భారీ బారికేడ్లతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ ఏకంగా బారికేడ్ల పైకెక్కి నిరసన తెలిపారు. విద్యార్థులు, మహిళలపై ఉద్దేశపూర్వకంగానే దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, సీజేఐ సూచన మేరకు రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అధికారికంగా నమోదైంది. విపక్ష నేతలను నేరుగా కలిసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. ఈ వ్యవహారం ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్నందున, అధికారికంగా పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. అంతకుముందు ..మిగతా 2లో

ప్రజల దాహం కంటే

బీర్లే ముఖ్యమా

సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ

కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి

కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ



హైదరాబాద్, అక్టోబర్ 12:

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

ఈ కార్ రేసింగ్ కేసులో నా పేరు తొలగించండి: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 12:



ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఫార్ములా-ఈ రేస్ నిర్వహణలో నిధుల మళ్లింపు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ చార్జిషీట్‌లో తనను ఏ-1 నిందితుడిగా పేర్కొనడాన్ని కేటీఆర్ సవాల్ చేశారు.ఈ కేసుకు తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

ప్రజల కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకే ఉంది: డీజీపీ సీవీ ఆనంద్



తెలంగాణ పోలీస్ అకాడమీలో 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్

2లో..

పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టం

నాయకత్వం, నైతిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానంపై డీజీపీ దిశానిర్దేశం

నేరాల తీరు మారింది.. పోలీసింగ్ మారాలి

ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా సేవలందించాలి

పాసింగ్ అవుట్ పరేడ్ లో చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి

విధులు ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి: డీజీపీ సీవీ ఆనంద్

ఎల్‌నినో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు

ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉంది

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రంగారెడ్డి జిల్లా :

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో ఏర్పడే పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అన్ని రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించింది.ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రపంచ వాతావరణ సంస్థ నివేదికల ప్రకారం ఎల్‌నినో ప్రభావం డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని, 2027 వరకు ఇలాంటి పరిస్థితులు కొనసాగవచ్చని అంచనాలు ఉన్నట్లు తెలిపారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం కారణంగా ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గత నాలుగు నెలలుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, జిల్లా యంత్రాంగం ద్వారా రైతులను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడంతో పాటు వ్యవసాయ



శాస్త్రవేత్తల సూచనల మేరకు తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని అన్నారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో పంటలు సాగు చేసి నష్టపోవద్దని, కొత్తగా నాటిన ఉద్యాన పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఎల్‌నినోపై వచ్చే వదంతులను నమ్మకుండా, రైతులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో వ్యవహరించి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితులపై రైతులను ముందుగానే అప్రమత్తం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల మేర వరి సాగు విస్తీర్ణం తగ్గిందని పేర్కొన్నారు. సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడంతో పాటు రబీలో పప్పుదినుసులు, నూనెగింజలు, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.



విద్యుత్ సరఫరా, భూగర్భ జలాల లభ్యతపై వాస్తవ పరిస్థితులను రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, వాతావరణ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక శాఖల అధికారులు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న చర్యలను వివరించారు.

ప్రస్తుత పంటల సంరక్షణ, తాగునీటి సరఫరా, రబీ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలి

అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగానే పంటల సాగు ప్రణాళికలు రూపొందించాలి: జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఉప్పరిగూడ రైతు వేదికలో హాజరైన రైతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే సాగులో ఉన్న పంటలను ..మిగతా 2లో

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
మంగళవారం
13 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

ఎల్‌నినో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు

ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉంది

మొదటి పేజీ తరువాయి...

కాపాడటంతో పాటు, రాబోయే రబీ సీజన్‌కు అందుబాటులో ఉన్న నీటి వనరుల ఆధారంగా పంటల సాగు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలకు ఇప్పటికే పెట్టుబడులు పెట్టినందున, వాటిని సాధ్యమైనంతవరకు కాపాడి రైతులకు నష్టం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో సాగునీటి కోసం అధికంగా బోరుబావులపై ఆధారపడుతున్న నేపథ్యంలో విద్యుత్‌ను, భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసే విద్యుత్ అందుబాటులో ఉన్న సమయంలో అవసరమైన మేరకే వినియోగిస్తూ, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ ప్రయోజనం పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే వేసవి కాలం వరకు ప్రజలకు, పశువులకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న పాత తాగునీటి పథకాలు, బోర్లు, మోటార్లు తదితరాలను పరిశీలించి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి ఆవాసంలో తాగునీటి వనరులను పనిచేసే స్థితిలో ఉంచాలని, పశువులకు అవసరమైన నీటి సదుపాయాలను కూడా ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.రబీ సీజన్‌లో పంటల సాగుకు సంబంధించి రైతులు తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా, తమకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, బోరుబావుల నీటి మట్టాలు, సాగునీటి అవసరాలను అంచనా వేసుకొని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో సాగు చేసిన విస్తీర్ణంతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటల విస్తీర్ణాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంటే ఆ దిశగా ఆలోచించాలని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ, స్వల్పకాలిక పంటలను ప్రోత్సహించాలని, రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా తగిన సలహాలు అందించాలని ఆదేశించారు.

పంటలు సాగు చేయలేని పరిస్థితులు ఏర్పడిన ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేలా గ్రామీణ ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వీబీ-జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామాలు, ఆవాసాల్లో నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షపు నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులను గుర్తించి చేపట్టాలని తెలిపారు. దీనివల్ల వ్యవసాయ పనులు లేని సమయంలో గ్రామీణ ప్రజలకు ఉపాధి లభించడంతో పాటు భవిష్యత్తులో నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలు, వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా, పశు సంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ప్రాంతాల మార్కెట్ అవకాశాలను వినియోగించుకొని ఆకుకూరలు, ఇతర స్వల్పకాలిక పంటల సాగును ప్రోత్సహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, ముందస్తు ప్రణాళికతో సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, డిపిఓ సురేష్ మోహన్, పిడి డీఆర్డీఏ శ్రీలత, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మిషన్ భగీరథ అధికారి రాజేశ్వర్ రావు, పశుసంవర్ధక శాఖ అధికారి, ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకే ఉంది: డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్: అక్టోబర్ 12:

పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టమని, ప్రజలకు సేవ చేయడంతోపాటు వారి ప్రాణాలను కాపాడే అరుదైన అవకాశం పోలీసు శాఖలో పనిచేసేవారికి లభిస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల జనాభాలో సుమారు 90 వేల మందికే పోలీసు యూనిఫాం ధరించే అవకాశం ఉందని, ఇది మొత్తం జనాభాలో 0.3 శాతం మాత్రమేనని వివరించారు. ప్రతిరోజూ కనీసం 50 మంది కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకు ఉంటుందని పేర్కొన్నారు. నిజాయితీ, నైతిక విలువలను విస్మరించరాదని, కుల, మత, రాజకీయ రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014 తర్వాత పూర్తిస్థాయిలో శిక్షణ ముగించుకుని బయటకు వస్తున్న తొలి డీఎస్పీ బ్యాచ్ కావడంతో దీనికి ప్రత్యేకత ఉందన్నారు. 44 వారాలపాటు చట్టాలు, దర్యాప్తు విధానాలు, ఔట్‌డోర్ శిక్షణ, క్రీడల్లో శిక్షణ పొందిన అధికారులను అభినందించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసిస్తూ, అకాడమీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల ముఖ్యమంత్రి పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారని పేర్కొన్నారు.

30 ఏళ్ల వృత్తి జీవితానికి పునాది

పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా చేసే ప్రమాణం అధికారుల 30--35 ఏళ్ల వృత్తి జీవితానికి మార్గదర్శకంగా నిలవాలని డీజీపీ సూచించారు. రాజ్యాంగం పట్ల నిబద్ధతతో, ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తానని చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. అకాడమీలో శిక్షణ పూర్తయిన తర్వాత మరో 46 వారాలపాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ దశలోనూ అదే శ్రద్ధ, క్రమశిక్షణ, నిజాయతీతో వ్యవహరించాలని సూచించారు. తన 35 ఏళ్ల పోలీసు అనుభవంలో నేర్చుకున్న అంశాలను గతంలో డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖిలో వివరించానని, నాయకత్వ లక్షణాల ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేస్తున్నానని చెప్పారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి: డీజీపీ

ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మీరు నాయకులుగా ఎంపికయ్యారు.. మీ నాయకత్వ లక్షణాలను విధుల్లో నిరూపించుకోవాలని అన్నారు. ధైర్యం, దార్శనికత, నైతిక విలువలు, నిష్పాక్షికత, బృంద స్ఫూర్తి, సంభాషణ నైపుణ్యాలు, కష్టపడే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనలు, వినయం.. ఈ పది లక్షణాలను ప్రతి అధికారి అలవర్చుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నైతిక విలువలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదన్నారు.

నేరాల తీరు మారింది.. పోలీసింగ్ మారాలి..

తాము యూనిఫాం ధరించిన రోజుల్లో నక్సలిజం ప్రధాన సవాలుగా ఉండేదని, ఆ సమస్యను పోలీసులు సమర్థంగా ఎదుర్కొన్నారని డీజీపీ గుర్తుచేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, రోడ్డు భద్రత, ఇతర కొత్త తరహా సవాళు



పోలీసుల ముందున్నాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసు శాఖలో సంస్థాగత మార్పులు చేపట్టామని చెప్పారు. గ్రేహౌండ్స్ తదితర విభాగాల పునర్వ్యవస్థీకరణతోపాటు ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీ ఫాస్ట్, టీజీ స్పార్క్ వంటి విభాగాలను బలోపేతం చేసి కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు కూడా ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి

పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం, చురుకుదనం, వృత్తిపరమైన నైపుణ్యాలు అత్యంత ముఖ్యమని డీజీపీ అన్నారు. యూనిఫాం ధరించిన తొలిరోజు ఉన్న ఉత్సాహం, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ 30 ఏళ్ల తర్వాత కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. పోలీసు పాసింగ్ అవుట్ పరేడ్‌లో బెల్టుపై ఉన్న హోల్ (రంధ్రం) 30 ఏళ్ల సర్వీసు పూర్తయ్యే వరకు, ఉద్యోగ విరమణ చేసేంతవరకు అలాగే ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, సమర్థవంతమైన నాయకులుగా ఎదగాలని డీఎస్పీలకు పిలుపునిచ్చారు.

112 సంఖ్యకు ప్రత్యేక అనుబంధం: అకాడమీ డైరెక్టర్

తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ.. 112 సంఖ్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ప్రజల అత్యవసర సేవల కోసం తెలంగాణ పోలీసు వ్యవస్థలో 112 సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పుడు 112 మంది డీఎస్పీలు ప్రజా సేవలోకి అడుగుపెట్టడం విశేషమని పేర్కొన్నారు. వీరిలో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు ఉన్నారు. మల్టీజోన్-1 నుంచి 51 మంది, మల్టీజోన్-2 నుంచి 61 మంది ఎంపికయ్యారు. విద్యార్హతల పరంగా 79 మంది డిగ్రీ పట్టభద్రులు, 31 మంది పీజీ పూర్తి చేసినవారు ఉన్నారు. మరో ఇద్దరిలో ఒకరు ఎంబీబీఎస్, మరొకరు బీడీఎస్ పట్టా పొందారు. ఈ బ్యాచ్‌లో గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 45 మంది, కేంద్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 12 మంది ఉండగా.. కొత్తగా ఉద్యోగ జీవితంలోకి అడుగుపెడుతున్నవారు 55 మంది ఉన్నారు. గతంలో పోలీసు శాఖలో ఎస్సైలుగా పనిచేసిన నలుగురు ప్రస్తుతం డీఎస్పీలుగా ఎంపికయ్యారు. శిక్షణ పొందుతూనే 2026లో యూపీఎస్సీ పరీక్షల్లో జి.సృజన 55వ ర్యాంకు, డి.ప్రవీణ్‌కుమార్ 795వ ర్యాంకు సాధించడం విశేషం. ఆరు వారాల ఫౌండేషన్ శిక్షణను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో అందించినట్లు చెప్పారు. అకాడమీ నినాదమైన నాలెడ్జ్, స్కిల్, ఆటిట్యూడ్ ఆధారంగా అధికారులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. క్షేత్రస్థాయి అనుభవం కల్పించేందుకు మేడారం జాతర, వినాయక





చవితి, ఇతర ప్రధాన కార్యక్రమాల్లో విధులు నిర్వహించే అవకాశం కల్పించామన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఈగల్ వంటి విభాగాలతో శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. పోలీసుల విధి ప్రజలకు న్యాయం చేయడమేనని, వారి పనితీరును బట్టే ప్రజలు వారిని అంచనా వేస్తారని అన్నారు.

నేహా అగర్వాల్‌కు సీఎం రివాల్వర్.....9 విభాగాల్లో ఉత్తమ ప్రతిభకు ట్రోఫీలు, పతకాలు

పోలీస్ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నేహా అగర్వాల్ ముఖ్యమంత్రి రివాల్వర్‌తో పాటు మరో మూడు పురస్కారాలను అందుకున్నారు. బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌కు సీఎం రివాల్వర్, రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకం, కోన రామచంద్రారెడ్డి స్మారక బంగారు పతకం, ఇండోర్ సబ్జెక్టుల్లో ప్రతిభకు హోంమంత్రి బేటన్ ఆమెకు లభించాయి. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకంతో పాటు రూ.5,000 నగదు బహుమతి కూడా అందుకున్నారు. ఇతర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిలో ఔట్‌డోర్ సబ్జెక్టుల్లో ఎల్. శ్రీకాంత్ డీజీపీ ట్రోఫీ, ఫైరింగ్‌లో టి. జాకబ్ అభిషేక్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో డి. చందన, క్రిమినాలజీలో చి. ఆది శేషు రెడ్డి ఎన్ఐసీఎఫ్ఎస్ పతకాలు సాధించారు. దర్యాప్తులో ఉత్తమ ప్రతిభకు ఆర్. సాయి కిరణ్ రెడ్డి డైరెక్టర్ పతకాన్ని దక్కించుకున్నారు.

చట్టాల నుంచి సైబర్ నేరాల దర్యాప్తు వరకు

44 వారాల సంస్థాగత శిక్షణలో భాగంగా ఇండోర్, అవుట్‌డోర్ అంశాలను రెండు సెమిస్టర్లుగా విభజించారు. ఇండోర్ శిక్షణలో పోలీసు వ్యవస్థ, నేరశాస్త్రం, నేరాల నివారణ, మానవ హక్కులు, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియం, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఫోరెన్సిక్ సైన్స్, నాయకత్వం, నిర్వహణ వంటి అంశాలను బోధిస్తున్నారు. శారీరక నేరాలు, ఆస్తి సంబంధ నేరాలు, సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల దర్యాప్తు విధానాలపైనా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అంతర్గత భద్రత, శాంతిభద్రతల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆయుధ వినియోగం.. క్షేత్రస్థాయి నైపుణ్యాలు

అవుట్‌డోర్ శిక్షణలో శారీరక వ్యాయామాలు, డ్రిల్, పరేడ్, ఆయుధ వినియోగం, కాల్పులు, ఫీల్డ్‌క్రాఫ్ట్, మ్యాప్ రీడింగ్, వ్యూహాత్మక విధానాలు, వీఐపీ భద్రత, పేలుడు పదార్థాలు, ఐఈడీల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. స్విమ్మింగ్, ప్రథమ చికిత్స, అంబులెన్స్ డ్రిల్, వాహనాల డ్రైవింగ్, విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక చర్యలు, క్రీడలకూ ప్రాధాన్యం ఇచ్చారు.

పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీనియర్ పోలీసు అధికారులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, అకాడమీ సిబ్బంది, శిక్షణ పొందిన డీఎస్పీల కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టుకు ఇండీ కూటమి నేతల భారీ ర్యాలీ

మొదటి పేజీ తరువాయి...

కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన నేతలు బస్సులో కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ బయలుదేరారు. విపక్షాల నిరసనల దృష్ట్యా దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ర్యాలీ సాగే మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బారాఖంబా జంక్షన్ నుంచి మండి హౌస్ వరకు భద్రతా బలగాలను భారీగా మోహరించి, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

"ఈ రోజు దేశమంతా రోడ్లపైకి వచ్చింది. రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఇక్కడకు చేరుకున్నారు. మా అందరి డిమాండ్ ఒక్కటే సుప్రీంకోర్టు మా వాదనను వినాలి. సిఈసీ చేసిన పని చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం. ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సిందే. మేము బయటపెట్టిన 'ఓట్ల చోరీ'కి సంబంధించిన ఆధారాలు, ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మనం పోరాడాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. మేము శాంతియుతంగా, గాంధేయ పద్ధతిలో మాట్లాడాలని అనుకుంటున్నాం. కానీ పోలీసులు యువతపై దాడులు చేస్తున్నారు. నాయకులను జైలుకు పంపుతున్నారు. ఇది తప్పు. సరైన చర్యలు తీసుకునేలా సుప్రీంకోర్టు మా వాదనను వినాలని నేను భావిస్తున్నాను. ఆ పదవిలో కొనసాగే హక్కు సిఇసికి లేదు. ఈ ప్రభుత్వం తనను తాను రక్షించుకోవడానికి పోలీసులను ముందుంచుతోంది." అని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ అన్నారు.

దిల్లీలోని ఆరు కీలక మెట్రో స్టేషన్ల మూసివేత

మరోవైపు ఇండీ కూటమి ఆందోళనల నేపథ్యంలో దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక ప్రకటన చేసింది. భద్రతా కారణాల దృష్ట్యా దిల్లీలోని ఆరు కీలక మెట్రో స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను సాయంత్రం నాలుగు గంటల వరకు మూసివేస్తున్నట్లు వెల్లడించింది. నిరసనలు జరిగే మార్గంలో ఉన్న జన్‌పథ్, మండి హౌస్, బారాఖంబా రోడ్, సెంట్రల్ సెక్రటేరియట్, రాజీవ్ చౌక్, పటేల్ చౌక్ మెట్రో స్టేషన్లలో ప్రయాణికులు బయటకు వెళ్లడానికి, లోపలికి రావడానికి అనుమతించబోమని స్పష్టం చేసింది. అయితే ఈ స్టేషన్ల పరిధిలో మార్గాలు మారేందుకు ఉపయోగపడే ఇంటర్‌చేంజ్ సదుపాయం మాత్రం ప్రయాణికులకు యథాతథంగా అందుబాటులో ఉంటుందని డీఎంఆర్సీ తెలిపింది.



ఇసుక టిప్పర్ పట్టివేత

జోగుళాంబ గద్వాల్ , అక్టోబర్ 12:

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక టిప్పర్‌ను సోమవారం కేటిదొడ్డి పోలీసులు పట్టుకున్నారు. కర్నూలు నుంచి కేటీ దొడ్డి గ్రామానికి ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్ డ్రైవర్ , ఓనర్ అయిన జె. ప్రవీణ్ కుమార్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు.



కాంగ్రెస్ ఎంపీ అంగోమ్చా బిమోల్ దిష్టిబొమ్మ దహనం చేసిన గద్వాల బీజేపీ మహిళా మోర్చా

జోగుళాంబ , అక్టోబర్ 12:

పాలమూరు ఎంపీ డీకే అరుణ, యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం గద్వాల పట్టణ వైఎస్సార్ చౌక్‌లో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సమతా మధు గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజమ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.జేఎన్ యు ప్రొఫెసర్‌గా పనిచేస్తూ మణిపూర్ నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలిచిన అంగోమ్చా బిమోల్.. మహిళా విద్యార్థినులను లైంగికంగా వేధించారనే ఆరోపణలపై బీజేపీ మహిళ మోర్చ అధ్యక్షురాలుసమత మధు గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన శిక్ష విధించాలని, ఎంపీ పదవిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే ఢిల్లీలో రాహుల్ గాంధీ మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా ఖండించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్కోటే, సమత మధు గౌడ్, మహిళా మోర్చా, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులు..రెండో రోజు గాయత్రీ దేవి అలంకారం

జోగుళాంబ గద్వాల , అక్టోబర్ 12:



పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ శరన్నవరాత్రులు కోలహలం ప్రారంభమయ్యింది. రోజుకో అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చే అమ్మవారు శరన్నవరాత్రి రెండో రోజు గాయత్రి దేవిగా భక్తులను అనుగ్రహిస్తుంది. వేదాలకు అధిదేవత అయిన గాయత్రి మాత ఆరాధనతో సమస్త విద్యలు ఒంటబడతాయనేది భక్తుల నమ్మకం. గాయత్రీదేవి అలంకారంలో తాయమ్మ అమ్మవారు భక్తులకు దర్శనంగద్వాల పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా గద్వాల పట్టణం రెండో వార్డులో శ్రీశ్రీశ్రీ శక్తి స్వరూపిణి తాయమ్మ అమ్మవారు మంగళవారం రెండో రోజు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్ఠాన దేవతగా అమ్మవారిని భక్తులు కొలిచారు. శ్రీతాయమ్మ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు.

ప్రజలు అందించే వినతులను అధికారులు తక్షణమే పరిష్కరించాలి

ప్రజావాణికి(102)ఫిర్యాదులు

రంగారెడ్డి జిల్లా , అక్టోబర్ 12 :

ప్రజలు అందించే వినతులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (102) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తో కలిసి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ--49, ఇతర శాఖలు --53, మొత్తం 102 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

- ఇండ్లు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు సాధన లక్ష్యంగా
- ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా తడికమళ్ళ దేవదానం (దేవా)
ప్రధాన కార్యదర్శిగా చీపు గంగాధర్ ఏకగ్రీవ ఎన్నిక
- సత్తుపల్లి ఎమ్మెల్యే పలువురు రాజకీయ,
ప్రజా సంఘాల నాయకులు అభినందనలు





ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 12 : (భద్రాద్రిన్యూస్): సత్తుపల్లి నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్, మనం దినపత్రిక సత్తుపల్లి నియోజకవర్గం రిపోర్టర్ తడికమళ్ళ దేవదానం (దేవా) ప్రధాన కార్యదర్శిగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చీపు గంగాధర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సోమవారం సత్తుపల్లి పట్టణంలో చెర్రీస్ రెస్టారెంట్ నందు నిర్వహించిన నూతన ప్రెస్ క్లబ్ ఎన్నికల మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తోట కిరణ్ అధ్యక్ష కార్యదర్శులను ప్రకటించగా సీనియర్ రిపోర్టర్ మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మాదిరాజు సుధాకర్, ఎం డి షైబుద్దిన్, భీమిశెట్టి రాము, చిన్నేని బాలకృష్ణ లు మద్దతు ప్రకటించారు. ప్రెస్ క్లబ్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవమైనది. అనంతరం పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ,అర్హత గల జర్నలిస్టులకు ఇండ్లు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల సాధన లక్ష్యంగా పనిచేయాలని తీర్మానం చేశారు. నూతనంగా ఎంపికైన అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ దయానంద్ విజయ్ కుమార్, పలువురు రాజకీయ,ప్రజా సంఘాల నాయకులు పలువురు జర్నలిస్టులు అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన ఇరువురికి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు.శీలం శ్రీనివాసరెడ్డి. బొల్లెపోగు సురేష్, జె శ్రీనివాసరావు, యనమాల విజయ్, బాలాజీ, కొత్తపల్లి సుధాకర్,నల్లంటి మోహన్,ఆనంద్, షేక్ మీరా, బాజీ, అశోక్, మీరజ్, రామారావు, ఉమామహేశ్వరరావు, సాంబశివరావు, కాకర్ల జగన్, బెల్లం చిరంజీవి, హరిబాబు, చందు,విష్ణు తదితరులు పాల్గొన్నారు. దేవా నియామకం పట్ల హన్స్ ఇండియా మేనేజర్ వీరమనేని వెంకటేశ్వరావు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా మిత్రులు ,శ్రేయోభిలాషులు ,ప్రజాప్రతినిధులు, సత్తుపల్లి పుర ప్రముఖులు ,జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్లకు ఇరువైపులా చెత్త తొలగింపు

– పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం.. మూడు గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతాం



గుండాల, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్): మండల పరిధిలోని కాచనపల్లి గ్రామపంచాయతీ 5వ వార్డులో వీధి రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జరుపుల కిషన్, పంచాయతీ కార్యదర్శి కొరస ఉమాదేవి చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని వారు పేర్కొన్నారు. కాచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల్లో అన్ని రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించి, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని సర్పంచ్ జరుపుల కిషన్, కార్యదర్శి కొరస ఉమాదేవి తెలిపారు. గ్రామస్తులు కూడా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని వారు కోరారు.

మహిళలపై వేధింపుల ఆరోపణలు..
కాంగ్రెస్ ఎంపీని సస్పెండ్ చేయాలి!

- అంగోమ్చు భీమల్ అకోజైమ్‌పై
చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్
రెడ్డి నేతృత్వంలో ఎంపీ దిష్టిబొమ్మ దహనం



కొత్తగూడెం అర్బన్ , అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్): మణిపూర్‌కు చెందిన కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) ప్రొఫెసర్ అంగోమ్చు భీమల్ అకోజైమ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మీదేవిపల్లి ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి మాట్లాడుతూ.. మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధిపై విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు రావడం ఆందోళనకరమని అన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిందితుడిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం విద్యాసంస్థ నుంచి సస్పెండ్ చేయడం సరిపోదని, కాంగ్రెస్ పార్టీ కూడా ఆయనపై చర్యలు తీసుకొని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించాలని కోరారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేతలు, తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధిపై వచ్చిన ఆరోపణల విషయంలో స్పష్టమైన వైఖరి ప్రకటించాలని అన్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను బీజేపీ మహిళా మోర్చా సహించబోదని, ఈ వ్యవహారంలో న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని గాయత్రి పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న నాయక్, జిల్లా ఉపాధ్యక్షురాలు, మూడో డివిజన్ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ముప్ప అపర్ణ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఆకునూరి పద్మ, మహిళా మోర్చా ఐటీ కన్వీనర్ పోలే మనశ్విని, అధికార ప్రతినిధి భోగాలక్ష్మి, కార్యవర్గ సభ్యురాలు కుసుమ భవాని, సోను తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బెల్ట్ షాపుల్లో ఎంఆర్‌పీ కంటే రూ.60 అధికంగా మద్యం విక్రయం!

– అక్రమ మద్యం సరఫరాపై చర్యలు తీసుకోవాలి
– జిల్లా అదనపు కలెక్టర్‌కు సేవాలాల్ బంజారా సంఘం వినతి



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్): జిల్లాలోని పలు మండలాల్లో బెల్ట్ షాపులకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ, ఎమ్మార్పీ కంటే రూ.30 నుంచి రూ.60 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, చంద్రుగొండ మండలాల్లో కొందరు మద్యం దుకాణాల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి గ్రామీణ ప్రాంతాల్లోని బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్నారని ప్రసాద్ నాయక్ ఆరోపించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయించడం వల్ల సామాన్యులు, పేద ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు, గృహహింస పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి మండలాల్లో ఆటోల ద్వారా గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు చేసినప్పటికీ ఎక్సైజ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. జిల్లా యంత్రాంగం ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న వారితో పాటు అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బాదావత్ అనిల్ కుమార్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య హరీష్ నాయక్, జిల్లా కార్యదర్శి ధరావత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం, తిరుమలాయపాలెం మండలంలో మాజీ ఎంపీ నామ పర్యటన

- పలు కుటుంబాలకు పరామర్శ..
కాబోయే వధూవరులకు ఆశీస్సులు



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 12 (భద్రాద్రిన్యూస్) : బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సోమవారం ఖమ్మం కార్పొరేషన్, తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని మామిళ్లగూడెంలో నమస్తే తెలంగాణ బ్యూరో మాటేటి వేణుగోపాల్ తండ్రి శ్రీరామారావు ఇటీవల మృతి చెందడంతో, వారి స్వగృహానికి వెళ్లి శ్రీరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను నామ పరామర్శించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి రాంనారాయణ, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు. అనంతరం ఎన్.ఎస్.టి. రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ప్రతిజ్ఞ దినపత్రిక ఎడిటర్ వేణు భార్యను నామ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న నామ, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆ తర్వాత తిరుమలాయపాలెం మండలం పాపాయిగూడెం గ్రామ వాస్తవ్యులు ఏలూరి సిద్ధార్థ సతీమణి హైమావతి ఇటీవల డెంగీ జ్వరంతో మృతి చెందడంతో, వారి స్వగృహానికి వెళ్లిన నామ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ చామకూరి రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ నామ ప్రసాద్, నాయకులు నామ ప్రభాకర్, ఏలూరి శ్రీనివాసరావు, పరికపల్లి చంద్రశేఖర్, నామ శరత్ తదితరులు పాల్గొన్నారు.

కాబోయే వధూవరులకు నామ ఆశీస్సులు

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో గోడవర్తి శ్రీను కుమారుడు అఖిల్ సాయి, చావా శివరామకృష్ణ కుమార్తె సిరి వెన్నెల నిశ్చితార్థ వేడుకలో నామ పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్ రావు, గొడ్డేటి మాధవరావు, తన్నీరు రవి, వాకదాని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మున్నూరుకాపు ఖమ్మం పట్టణం సహాయ కార్యదర్శిగా మేడి పవన్ కుమార్



ఖమ్మం ప్రతినిధి ,అక్టోబర్ 12 (భద్రాద్రిన్యూస్): ఖమ్మం పట్టణ మున్నూరుకాపు సహాయ కార్యదర్శిగా మామిళ్ళగూడెం 49వ డివిజన్ కు చెందిన మేడి పవన్ కుమార్ ను మున్నూరుకాపు జిల్లా కమిటీ ఎంపిక చేసింది.. ఈరోజు ఖమ్మం పట్టణంలోని మున్నూరుకాపు హాస్టల్ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం, మరియు జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బిఆర్ఎస్ పార్లమెటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా పట్టణ సహాయ కార్యదర్శిగా ఎంపికైన శ్రీ మేడి పవన్ కుమార్ సన్మానిస్తు ప్రశంస పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా మేడి పవన్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను తనకు అప్పగించినందుకుగాను రాష్ట్ర, జిల్లా మునూరుకాపు నాయకులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.. తాను సంఘ అభివృద్ధి కోసం శక్తివంచను లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా మేడి పవన్ కుమార్ తెలియజేశారు.. మున్నూరు కాపులంతా సంఘటితంగా ఉండి తమ సమస్యల సాధన కోసం అనునిత్యం పోరాడాలని మేడి పవన్ కుమార్ పిలుపునిచ్చారు.

కోడలి బంధువులతో ప్రాణహాని

- క్యాన్సర్ బాధితురాలైన మహిళపై
కోడలి బంధువుల పాశావిక దాడి?
- తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తనకు
రక్షణ కల్పించాలని వేడుకోలు
- బాధితురాలికి న్యాయం జరిగేనా?





పాల్వంచ అక్టోబర్ 12 (భద్రాద్రిన్యూస్): క్యాన్సర్‌తో బాధపడుతూ తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న ఓ మహిళపై కోడలి కుటుంబ సభ్యులు దాడికి పాల్పడిన ఘటన పాల్వంచ సోనియా నగర్ లో చోటుచేసుకుంది. గంగారం తండా, సింగరేణి గ్రామం ఖమ్మం జిల్లాకు చెందిన అజ్మీరా సక్రి తన కొడుకు అజ్మీరా రాజు ఇంటికి వచ్చింది. భార్య భర్తల మధ్య జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న కోడలు నాగమణి సోదరుడు బానోత్ కిషోర్ తో పాటుగా బంధువులైన బానోత్ నిఖిల్, బానోత్ నగేష్ లు రాజుపై దాడి చేస్తుంటే అడ్డుకున్నందుకు తన తలపై రాయితో దాడి చేసి కిందపడేసి విచక్షణరహితంగా కాళ్లతో కొట్టారని తెలిపింది. ఇప్పటికే ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న మహిళపై మానవత్వం మరిచి దాడిచేసిన వారిపై పాల్వంచ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసారన్నారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న తన తల్లిపై రాయితో దాడి చేయడమే కాక నెత్తుటి మడుగులో ఉన్నప్పటికీ కనికరం లేకుండా కాళ్లతో కొడుతూ ఎప్పటికైనా మా చేతిలో చావాల్సిందే అంటూ బెదిరించిన వారిపై పోలీసులు కేసులు పెట్టిన మిమ్మల్ని వదిలేది లేదు మమ్మల్ని ఎవరు ఎం చేయలేరంటు దర్జాగా రోడ్లమీద తిరుగుతున్నారని, క్యాన్సర్ తో బాధపడుతున్న తన తల్లి గుక్కెడు మంచినీళ్లు తాగటానికి కూడ ఇబ్బంది పడుతుందని అదే దాడిలో గాయపడిన అజ్మీరా రాజు ఆవేదన వ్యక్తం చేసాడు.

దాడిచేసి దర్జాగా తిరుగుతున్నారు...

తన తల్లిపై దాడికి పాల్పడ్డ వారు బయట తిరుగుతుంటే తన తల్లి మంచంపై నుండి లేచి కాలకృత్యాలకు వెళ్లేందుకు కూడ తీవ్రంగా ఇబ్బంది పడుతుందని బాధితురాలి కుమార్తె రాధ ఆవేదన వ్యక్తం చేస్తోంది. దాడి ఘటన అనంతరం ప్రాణ భయంతో ఉన్న తన తల్లి అజ్మీరా సక్రి, సోదరుడు అజ్మీరా రాజు లను జగ్గుతండాలోని తన ఇంట్లోనే ఉన్నారని పోలీసులు దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె వేడుకున్నారు.

మద్యం మత్తులో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ, అక్టోబర్ 12,(భద్రాద్రి న్యూస్): పాల్వంచ పట్టణ పరిధిలోని జగ్గుతండాలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. మద్యం మత్తులో క్షణికావేశంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు మరియు కుటుంబ సభ్యులు తెలిపారు. ?పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మరియు ఫిర్యాదు ఆధారంగా... జగ్గుతండాకు చెందిన అజ్మీర శంకర్ (54) అనే వ్యక్తి కొంతకాలంగా మద్యానికి బానిసై ప్రతిరోజూ తాగుతూ ఉండేవాడు. సోమవారం ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో మద్యం కోసం డబ్బులు తీసుకొని భర్త శంకర్ బయటకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య అజ్మీరా లక్ష్మి, కూతురు భూక్య పద్మ లు చుట్టుపక్కల వెతికారు. ?ఉదయం 11:30 గంటల ప్రాంతంలో తండా శివారులోని రోడ్డు పక్కన ఉన్న రావి చెట్టుపై శంకర్ తాను ధరించిన చొక్కాతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులైన జాటోత్ లాలు, గుగులోతు రాము, కేలోత్ హర్సింగ్ తదితరులు అక్కడికి చేరుకుని చెట్టు ఎక్కి ఉరిని విప్పి కిందకు దించారు. అయితే అప్పటికే శంకర్ మృతి చెందాడు.మద్యం తాగవద్దని మందలించినందుకు క్షణికావేశంలో మద్యం మత్తులో ఉరివేసుకొని చనిపోయాడని, ఈ మృతిపై తమకు ఎలాంటి అనుమానం లేదని భార్య లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
మంగళవారం
13 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

ఖమ్మానికి ఆధ్యాత్మిక వైభవం.. శ్రీవారి ఆలయానికి శ్రీకారం!

- కులమతాలకు అతీతంగా ధర్మమార్గంలో పయనించాలి
- ప్రతి భక్తుడూ ఆలయ నిర్మాణంలో భాగస్వామి కావాలి: త్రిదండి చిన్నజీయర్ స్వామి
- మంత్రి తుమ్మల కృషితో ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి అడుగు..
- రూ.100 కోట్ల విలువైన భూమి కేటాయింపు..
- ఆలయ నిర్మాణానికి పలువురు ప్రముఖుల విరాళాలు

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్): ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురావడంతోపాటు భక్తులకు శ్రీ వేంకటేశ్వర స్వామి సేవలను మరింత చేరువ చేయనున్న ఆలయ నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లీపురంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తదితరులు భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. వేదమంత్రాల నడుమ జరిగిన ఈ పవిత్ర కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

కులమతాలకు అతీతంగా ధర్మాన్ని ఆచరించాలి
త్రిదండి చిన్నజీయర్ స్వామి

ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు శుభసూచకమని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవారు ఖమ్మం నగరానికి విచ్చేసేందుకు ఈ శంకుస్థాపనతో తొలి అడుగు పడిందని పేర్కొన్నారు. భగవంతుడిని స్మరించుకోవడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, ప్రతి శుభకార్యాన్ని దైవస్మరణతో ప్రారంభించడం మన సంప్రదాయమని వివరించారు. వసుధైక కుటుంబ భావన భారతీయ ధర్మానికి మూలమని, కులమతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. భక్తి, మంచి మనసు, ధర్మబద్ధమైన జీవనమే భగవంతుడి దృష్టిలో ముఖ్యమని పేర్కొన్నారు. ఆలయాలు కేవలం పూజలకు మాత్రమే పరిమితం కాకుండా మానవత్వం, సద్భావన, పరస్పర సహకారం, సామాజిక ఐక్యతను పెంపొందించే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఖమ్మంలో నిర్మించనున్న శ్రీవారి ఆలయానికి భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా విరాళాలు అందించి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి భక్తుడు ఒక ఇటుక అందించినా అది ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం వహించినట్లేనని అన్నారు.

శ్రీవారి ఆలయ నిర్మాణం ఆనందంగా ఉంది
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూమిపూజలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి విచ్చేసిన త్రిదండి చిన్నజీయర్ స్వామికి, ఆలయ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాముడి ఆశీస్సులతో భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఇప్పుడు శ్రీవారి అనుగ్రహంతో ఖమ్మంలో మరో ఆధ్యాత్మిక కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే ఖమ్మం ప్రాంతం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మంత్రి తుమ్మల కృషి కీలకం
టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు

ఖమ్మంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ప్రధాన కారణమని టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ.100 కోట్ల విలువైన భూమిని ఆలయ నిర్మాణం కోసం కేటాయించడం అభినందనీయమన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, భక్తులకు ఆధ్యాత్మిక సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు. రాబోయే ఏడాది కాలంలో



ఐదు వేల ఆలయాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఖమ్మంలో ఆలయ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. టీటీడీ నిబంధనల ప్రకారం స్థానిక ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధుల్లో 25 శాతం స్థానిక భక్తులు సమకూర్చాల్సి ఉంటుందని వివరించారు.

భక్తుల సహకారంతో త్వరితగతిన నిర్మాణం
టీటీడీ జేఈవో ఎ. శరత్

ఖమ్మంలో టీటీడీ నమూనాలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మితం కావడం ఈ ప్రాంత ప్రజలకు విశేషమని టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్ అన్నారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. శ్రీవారి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందించే ముఖ్యమైన కేంద్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ

శ్రీవారి ఆలయ నిర్మాణానికి పలువురు ప్రజాప్రతినిధులు విరాళాలు ప్రకటించారు. ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.60 లక్షలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధు రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమానికి భోజన ఏర్పాట్లు చేసిన వ్యక్తి అదనంగా రూ.11 లక్షలు విరాళంగా అందించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. భక్తులందరూ తమ వంతు విరాళాలు అందించి ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు



రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి దయానంద్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కల వెంకటయ్యకు సత్కారం



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) : మొక్కల వెంకటయ్యకు భద్రాద్రి కలెక్టరేట్‌లో సోమవారం ఘనంగా సన్మానం చేశారు. కొత్తగూడెం పరిధి రామవరంలో ఉంటున్న రావి వెంకటయ్య రికార్డు స్థాయిలో మొక్కలు నాటినందుకు గాను ఆయనను ఇటీవల రవీంద్రభారతీలో రాష్ట్ర మంత్రులు పలువురు సన్మానం చేశారు. సన్మానం అందుకున్న వెంకటయ్య సోమవారం కలెక్టరేట్ కు రావడంతో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్ఓ పద్మావతి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత, వృద్ధుల శాఖ అధికారి వరప్రసాద్ చేతుల మీదుగా వెంకటయ్యను శాలువాతో సన్మానించి షీల్డ్ లను బహూకరించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ కోటి మొక్కల పెంపకమే లక్ష్యంగా మొక్కలు నాటే కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఇప్పటి వరకు 85 లక్షల 15 మొక్కలు నాటినట్లు తెలిపారు. తనకు అవకాశం ఉన్నంత వరకు మొక్కలు నాటుతానని ఆయన తెలిపారు.

భద్రాచలం రోడ్ స్టేషన్ పేరు మార్చాలి

- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాసిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) : భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ పేరును తక్షణమే కొత్తగూడెం రైల్వే స్టేషన్" గా మార్చాలని కొత్తగూడెం శాసనసభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కు ఆయన లేఖలు రాశారు. భద్రాచలం రోడ్ పేరు మార్చాలి. కొత్తగూడెం రైల్వే స్టేషన్ గా నామకరణం చేయాలి. ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా స్టేషన్ పేరు ఉండాలని లేఖలో పేర్కొన్నారు. స్టేషన్ ఉన్నది కొత్తగూడెంలోనే అయినందున ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా పేరు మార్చడం న్యాయమని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం, అంతర్జాతీయ బాలికా దినోత్సవంపై న్యాయ చైతన్య సదస్సు - విద్యార్థులకు అవగాహన



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి యం. రాజేందర్ గారి ఆదేశాల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చల్లగాలి సాహితి చుంచుపల్లి హైస్కూల్‌లో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం, అంతర్జాతీయ బాలికా దినోత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడిని అధిగమించడం, ఆత్మవిశ్వాసంతో ఉండటం, సమస్యలను పెద్దలతో పంచుకోవడం వంటి అంశాలను వివరించారు. బాలికల విద్య, సమాన హక్కులు, భద్రత, సాధికారతపై అవగాహన కల్పించారు. అలాగే పోక్సో చట్టం--2012, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై వివరించి, బాలల హక్కులను పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ కు రూ. 5 వేల కోట్లు కేటాయించాలి

- మంత్రివర్గంలో మున్నూరు కాపులకు చోటు కల్పించాలి
- ఖమ్మం మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- వైభవంగా జిల్లా నూతన కమిటీ, కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్, 12 (భద్రాద్రిన్యూస్):
తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ కు బడ్జెట్లో 5 వేల కోట్లు కేటాయించాలని రాజ్యసభ ఎంపీ, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బడ్జెట్లో ఈ నిధులు కేటాయిస్తే మున్నూరు కాపు యువత, మహిళ, నిరుపేద రైతులకు ఎంతో లాభం చేకూరుతుందని అన్నారు. సోమవారం ఖమ్మం మున్నూరు కాపు హాస్టల్ భవనంలో జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షులు కొత్త సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్నూరు కాపు సంఘంలో తాను మొదటి నుండి ఎన్నికలకు దూరమని.. ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ద్వారా మన ఐక్యతను నిరూపించుకోవాలనే ఆలోచనతో పనిచేస్తానని అన్నారు. ఇటీవల ఖమ్మం జిల్లాకు చెందిన అన్ని రాజకీయ పార్టీల్లోని మున్నూరు కాపు సంఘం నాయకుల సమక్షంలో పార్టీలకు అతీతంగా జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగిందని గుర్తు చేశారు. మున్నూరు కాపు కులంలో



జన్మించడం తన అదృష్టంగా భావిస్తున్నానని బీసీలలో మున్నూరు కాపుల జనాభా అత్యధికమని గతంలో వి హనుమంతరావు, డి. శ్రీనివాస్, కేశవరావు, పొన్నాల లక్ష్మయ్య లాంటివారు సీఎం పదవి పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నా చివరి నిమిషంలో చేజారిందని అన్నారు. మున్నూరు కాపులు అన్ని పార్టీలలో ఉండాలని కానీ సరైన సమయంలో ఐక్యత చూపాలని అన్నారు. ఇప్పటివరకు తాను మనం కులానికి చాలా తక్కువగా చేశామని ఇంకా ఎంతో చేయాల్సింది ఉందని అన్నారు. మొదట ఇంట గెలిచి రచ్చ గెలవాలని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మనం ఎదిగే క్రమంలో స్థానికంగా ఉన్న కులంలో మంచి పేరు సంపాదించి సేవ చేయాలన్నారు. 56% ఉన్న బీసీలను కలుపుకొని వెళ్ళినప్పుడు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా రాష్ట్ర మంత్రివర్గంలో మొదటిసారి మున్నూరు కాపులకు స్థానం దక్కకపోవడం బాధాకరమన్నారు. ఖమ్మంలో



మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ అభివృద్ధికి, సంఘం మాజీ అధ్యక్షులు మేకల సంగయ్య విగ్రహ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. హైదరాబాదులో వివిధ గ్రూప్ లు, సంఘాలుగా ఉన్న సంఘాన్ని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించడంతో ప్రభుత్వం కోట్లది రూపాయల ఐదు ఎకరాల భూమి ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు రూ. 150 కోట్ల నిధులతో భవన నిర్మాణానికి పునాదులు పడ్డాయి అన్నారు. ముఖ్యంగా జనాభాలో సగం బాగా ఉన్న మహిళలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని రాజకీయాలలో రాణించాలన్నారు. యువత వ్యాపారంలో రాణిస్తూ ఐక్యంగా ఉంటూ కుల సేవ చేయాలన్నారు యువత తలుచుకుంటే సాధించలేనిది లేదన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తాము ఎంచుకున్న రంగాల వైపు ముందుకు పోవాలన్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా మాజీ అధ్యక్షులు పారా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేంద్రం, నాయకులు మదూరి పూర్ణ, మెంతుల శ్రీశైలం, తోట రామారావు, తోట రమేష్, పగడాల మంజుల, తోట సుజలా రాణి, హారిక నాయుడు, పారా ఉదయ్ కుమార్, మేకల శ్రీనివాసరావు, మేకల నాగేందర్, మిర్యాల రామకృష్ణ, లక్కినేని రఘు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల కృష్ణ, కనకం జనార్ధన్, మేకల బిక్షమయ్య, పసుపులేటి నాసరయ్య తదితరులు పాల్గొన్నారు .

క్యాడర్ స్కీమ్‌ను సవరించాలి..

- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్వరలో ఉద్యమం
- ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) : సింగరేణి సంస్థలో సెక్రటేరియల్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ ఎప్పుడూ వెనుకడుగు వేయదని, సెక్రటేరియల్ సిబ్బంది సైతం కార్మికవర్గంతో కలిసి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉన్నత విద్యార్హతలు, సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ పదోన్నతులు లేకుండా ఉద్యోగులు పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని పేర్కొన్నారు. సింగరేణి సెక్రటేరియల్ సిబ్బంది సమస్యల పరిష్కారం, క్యాడర్ స్కీమ్ సవరణ, పదోన్నతుల కల్పన తదితర డిమాండ్ల సాధన కోసం ఆదివారం కొత్తగూడెంలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో కొత్తగూడెం రీజియన్ కార్పొరేట్, సత్తుపల్లి, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల క్లరికల్ ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వివిధ కార్మిక సంఘాల నాయకులను ఆహ్వానించగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. సింగరేణిలో అమలవుతున్న క్యాడర్ స్కీమ్‌ను సమీక్షించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సవరించాలని సదస్సులో ఉద్యోగులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా పీఏలు, ఓఎస్‌లకు తగిన పదోన్నతులు కల్పించి ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లోకి తీసుకురావాలని కోరారు. ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.విధుల నిర్వహణకు అవసరమైన సరైన ఫర్నిచర్ సౌకర్యాలు కల్పించాలని, కంప్యూటర్ అలవెన్స్ మంజూరు చేయాలని, సెక్రటేరియల్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. ఉద్యోగుల అవసరాలు, పని స్వభావం, బాధ్యతలను పరిగణనలోకి తీసుకొని తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సింగరేణిలో డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్, ఎంబీఏ వంటి ఉన్నత విద్యార్హతలు సాధించిన ఉద్యోగులకు వారి అర్హతలు, అనుభవానికి తగిన పోస్టింగులు, పదోన్నతులు కల్పించకపోవడం పట్ల ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొందని వంగ వెంకట్ అన్నారు. సంస్థకు 30 ఏళ్ల పాటు సేవలందించిన ఉద్యోగి సైతం క్లర్క్‌గానే పదవీ విరమణ చేయాల్సి రావడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగుల ప్రతిభను గుర్తించి, వారి విద్యార్హతలు, అనుభవానికి తగిన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కోల్ ఇండియాలో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి, అర్హతలకు అనుగుణంగా సింగరేణి ఉద్యోగులకు కూడా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. క్లరికల్ సిబ్బంది, పీఏలు, ఓఎస్‌లు తమ సమస్యలను బహిరంగంగా చెప్పుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.ఉద్యోగులు, కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని వంగ వెంకట్ స్పష్టం చేశారు. సెక్రటేరియల్ సిబ్బంది పదోన్నతులు, క్యాడర్ స్కీమ్ సవరణ, ఖాళీల భర్తీ, పనిభారం తగ్గింపు, ఫర్నిచర్ సౌకర్యాలు, కంప్యూటర్ అలవెన్స్ తదితర సమస్యలపై త్వరలోనే సమగ్ర ప్రణాళికతో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు రావాలని, కార్మికవర్గంతో కలిసి హక్కుల సాధన ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం నిర్లక్ష్యం చేయకుండా సానుకూలంగా స్పందించి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ సదస్సులో ఏఐటీయూసీ కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి, కార్పొరేట్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, ఆఫీస్ బేరర్లు నాగయ్య, మల్లికార్జున్, మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సికా నాయకులు నామా శ్రీనివాస్, రామ్‌సింగ్, రాజు, శ్యాం కిరణ్, సంజీవ్, రమణ, దివ్య, సౌజన్య తదితరులు హాజరయ్యారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొని సెక్రటేరియల్ సిబ్బంది సమస్యల పరిష్కారం, పదోన్నతుల విధానం, క్యాడర్ స్కీమ్ సవరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఫోర్జరీ సంతకాలతో భూ ఆక్రమణకు యత్నం?

- అసలు సర్వే నంబర్ 62/70/2.. చూపిస్తున్నది 61/62/3!
- సివిల్ వివాదంలో పోలీసుల జోక్యంపై బాధితుడి ఆవేదన.. ఉన్నతాధికారులు స్పందించేనా?



పాల్వంచ, అక్టోబర్12 (భద్రాద్రి న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బసవతారక కాలనీ గ్రామపంచాయతీ పరిధిలో భూ వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అసలు సర్వే నంబర్ 62/70/2 కాగా, సంబంధిత భూమి విషయంలో 61/62/3 సర్వే నంబర్‌ను చూపిస్తున్నారని, ఫోర్జరీ సంతకాలతో భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బానోతు భార్గవ నాయక్ (తండ్రి బద్రు నాయక్) ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ స్థాయిలో తమకు అనుకూలంగా న్యాయం జరిగినప్పటికీ, భూమి స్వాధీనంలోకి వెళ్లే ప్రయత్నంలో రూరల్ పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సివిల్ వివాదంలో పోలీసుల జోక్యం ఎందుకని ప్రశ్నిస్తూ, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. ఇదే వ్యవహారంలో సర్వే నంబర్ల మార్పులు, ఫోర్జరీ సంతకాల ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ రికార్డులు, రెవెన్యూ పత్రాలు, అసలు పట్టాదారు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. మరోవైపు, ఈ భూమికి సంబంధించిన పౌల్ట్రీ, బ్రిక్స్ ఫ్యాక్టరీల విద్యుత్ వినియోగం, బిల్లులు, గతంలో విధించిన జరిమానాల అంశాలను కూడా పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. అసలు సర్వే నంబర్ ఏది? మార్పులు జరిగితే వాటికి ఆధారాలేమిటి? ఫోర్జరీ సంతకాల ఆరోపణల్లో వాస్తవమెంత? సివిల్ వివాదంలో పోలీసుల జోక్యం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందా? అనే ప్రశ్నలకు సంబంధిత శాఖల విచారణతోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భూమికి సంబంధించిన అసలు పత్రాలు, సర్వే రికార్డులు, ఫోర్జరీ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బానోతు భార్గవ నాయక్ అధికారులను కోరుతున్నారు.

పేద విద్యార్థులకు, వివాహానికి ఆర్థిక చేయూత

- ఘనంగా శ్రీ వాసవి ఆర్యవైశ్య విద్యా-వివాహ సహాయ ట్రస్ట్ కార్యక్రమం
- 47 మంది విద్యార్థులకు, నిరుపేద యువతికి రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం

పాల్వంచ, అక్టోబర్12 (భద్రాద్రి న్యూస్):
పాల్వంచ పట్టణంలోని శ్రీ వాసవి భవన్‌లో శ్రీ వాసవి ఆర్యవైశ్య విద్యా – వివాహ సహాయ ట్రస్ట్ (ది.నెం. 14/2012) ఆధ్వర్యంలో పేద విద్యార్థులు , నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చే కార్యక్రమం అత్యంత వైభవంగా సోమవారం నిర్వహించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా సమాజంలోని పేద వర్గాలకు అండగా నిలిచే లక్ష్యంతో ట్రస్ట్ ఈ సేవలను విస్తరించింది.
?ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 47 మంది పేద ఆర్యవైశ్య విద్యార్థినీ, విద్యార్థులకు చదువు నిమిత్తం మరియు కొత్తగూడెంకు చెందిన ఒక నిరుపేద యువతి వివాహం నిమిత్తం కలిపి మొత్తం రూ. 2,50,000/- (రెండు లక్షల యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
చదువుల తల్లికి అండగా... ఈ విద్యా సహాయం అందుకున్న వారిలో మెడిసిన్ (డాక్టర్), ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్మీడియట్ తో పాటు 10, 9, 7వ తరగతులు చదువుతున్న ప్రజ్ఞావంతులైన పేద విద్యార్థులు ఉన్నారు. చదువుపై ఆసక్తి ఉండి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఈ ట్రస్ట్ భరోసాగా నిలుస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.
?కొత్తగూడెం యువతికి వివాహ సహాయం...
కొత్తగూడెంకు చెందిన ఒక నిరుపేద ఆర్యవైశ్య యువతికి వచ్చే నెలలో వివాహం కుదిరింది. ఆమె తండ్రి బట్టల కొట్లో గుమాస్తాగా పనిచేస్తూ అతి కష్ట మీద కుటుంబాన్ని పోషిస్తున్న వైనాన్ని తెలుసుకున్న ట్రస్ట్ నిర్వాహకులు, స్పందించి తక్షణమే ఆమెకు వివాహ సహాయం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.
2012 నుండి నిరంతరం సేవలు: ఈ సేవా సంస్థను 2012 సంవత్సరంలో శ్రీ చారుగుండ్ల దేవి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. అప్పటి నుండి నేటి వరకు ఏమాత్రం లాభాపేక్ష లేకుండ, నిరంతరం అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆర్యవైశ్యులకు, పేదలకు ట్రస్ట్ కొండంత అండగా నిలుస్తోంది. ఈ కార్యక్రమానికి ట్రూ జోన్ క్లీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల భవాని సురేష్, డాక్టర్ తాడికొండ ప్రవీణ్ కుమార్, పాల్వంచ చాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలవాది ప్రకాష్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తోటివారికి సాయం చేసే గొప్ప మనస్తత్వం ఆర్యవైశ్య సంఘానికి ఎప్పుడూ ఉంటుందని, ట్రస్ట్ నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని శ్రీ వంకదార నరసింహం కుమార్ తనదైన శైలిలో అద్భుతమైన వ్యాఖ్యానంగా (యాంకరింగ్) వ్యవహరించి సభను విజయవంతంగా నడిపించారు. ఈ



కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చిల్లంచర్ల గిరిధర్, కోశాధికారి మిట్టపల్లి నరసింహారావు, కార్యనిర్వహణ కార్యదర్శి షేగు జనార్ధన్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మహిళా వైస్ ప్రెసిడెంట్ పెండ్యాల రోజాలక్ష్మి, అలాగే ట్రస్ట్ సభ్యులు కంటాల వెంకటేశ్వరరావు, పసుమర్తి నాగేశ్వరరావు, గూడెపు శ్రీనివాస్, నల్లమల్లి లక్ష్మణమూర్తి, సంకా రవికుమార్, ధారా నరసింహారావు, కండే ప్రకాష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 12వ సీనియర్ అంతర్రాష్ట్ర సెపక్ తక్రా లెగ్ వాలీబాల్ 2026 - 27

- .గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం
- ముఖ్య అతిథి, గౌరవ అతిథులు గా వైరా ఎస్సై పుష్పాలరామారావు, న్యూ లిటిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ డాక్టర్ పి.భువనేశ్వర్ రావు





వైరా, అక్టోబర్ 12, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల లో 12వ సీనియర్ అంతర్రాష్ట్ర సపక్ తక్రా(లెగ్ వాలీబాల్) ఛాంపియన్ షిప్ 2026-27 విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం అక్టోబర్ 12 వ తారీఖున ముగిశాయి. ఈ క్రీడలలో మొత్తం ఉమ్మడి పది జిల్లాల నుండి పురుషులు 10 చెట్లు, మహిళలు 10 చెట్లు, పాల్గొనగా పురుషుల విభాగంలో మొదటి స్థానం హైదరాబాద్, ద్వితీయ స్థానం రంగారెడ్డి, త్వితీయ స్థానం నిజామాబాద్ సాధించగా, మహిళల విభాగంలో మొదటి బహుమతి రంగారెడ్డి, ద్వితీయ బహుమతి నిజామాబాద్, తృతీయ బహుమతి హైదరాబాద్ జట్లు సాధించగా, ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా ఎస్సై పుష్పాలు రామారావు, న్యూ లిటిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ డాక్టర్ పి. భూమేశ్వరరావు ల చేతుల మీదగా విజేతలకు బహుమతులు అందివ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉన్నటువంటి ఈ సపక్ తక్రా (లెగ్ వాలీబాల్) క్రీడను గ్రామీణ నేపథ్యంలో ఏర్పాటు చేసినందుకు న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల వేదిక ఇవ్వడం గర్వకారణం అన్నారు. విజేతల భవిష్యత్తులో ఇంకా మంచి గుర్తింపు పొందాలని, ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా, ఓటమి పాఠాలను నేర్చుకొని, అధైర్య పడకుండా నిరంతర ప్రాక్టీస్ తో గెలుపు అందుకునే అంతవరకు కృషి



చేయాలని, అదే క్రమంలో జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. మహిళా విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు రమ్యశ్రీ (రంగారెడ్డి), మోక్షజ్ఞ (రంగారెడ్డి) , అంజలి కుమారి(రంగారెడ్డి), రిక్కీ రెడ్డి (నిజామాబాద్), సిహెచ్. లక్ష్మీ రెడ్డి (నిజామాబాద్), నవత (హైదరాబాద్), ఆర్. మనీషా(వరంగల్), కే రజిత (ఖమ్మం), ఏ. తరంగని (హైదరాబాద్), శ్రీ వెన్నెల (కరీంనగర్), కే శైలజ (ఆదిలాబాద్), ఆర్. రితిక (వరంగల్), పురుషుల విభాగంలో డి. శశాంక్ (హైదరాబాద్), ఏ. హరినాథ్ (హైదరాబాద్), కే నిఖిల్ (హైదరాబాద్), వి సుమంత్ (రంగారెడ్డి), ఆర్ శ్రవీష్ వర్మ (రంగారెడ్డి), ఎస్ అఖిలేష్(మహబూబాద్), ఆర్.పవన్ కళ్యాణ్ (నిజామాబాద్), ప్రసన్న కుమార్(ఖమ్మం), అభినవ రానా (రంగారెడ్డి), ఏ. రాజేందర్(ఆదిలాబాద్), పి. జయంత్ విక్రం (నల్లగొండ), జి. అకిరణానంద్ కరీంనగర్ తదితరులు గెలుపొందగా ఈ కార్యక్రమంలో వైరా ఎస్సై పుష్పాల రామారావు, న్యూ లిటిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, శ్రీ కాపా మురళీకృష్ణ, ఖమ్మం జిల్లా సపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ బి. జగన్నాథ స్వామి, వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ శ్రీ ఆర్ శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రెటరీ, తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు

ఎల్‌టీఆర్ కేసుల పరిష్కారంలో జాప్యం ఎందుకు? ఆదివాసీలకు న్యాయం ఎప్పుడు?

- ఏజెన్సీ కోర్టు కేసులను వెంటనే పరిష్కరించాలి..
1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి!
- పీసా గ్రామసభ తీర్మానం లేకుండా కాంట్రాక్టు పనులు చేపట్టొద్దు.. గ్రీవెన్స్ డేలో ANS వినతి

వాజేడు, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) : ఆదివాసీల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, పెండింగ్‌లో ఉన్న ఎల్‌టీఆర్ (భూ బదలాయింపు నియంత్రణ) కేసులను తక్షణమే పరిష్కరించి గిరిజనులకు న్యాయం చేయాలని ఆదివాసి నవనిర్మాణ సేన **(ANS)** ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. వాజేడు మండలంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ూచీూ నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ఎస్‌డీసీ కోర్టు నుంచి వచ్చిన ఎల్‌టీఆర్ కేసులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. ఏజెన్సీ కోర్టు అధికారాలను, చట్టాలను గౌరవిస్తూ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, భూముల విషయంలో ఆదివాసీలకు అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి
ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ూచీూ నాయకులు డిమాండ్ చేశారు. గిరిజనుల భూముల పరిరక్షణ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, చట్ట నిబంధనలను ఉల్లంఘించే చర్యలను అడ్డుకోవాలని కోరారు. ఆదివాసీలకు రాజ్యాంగం, చట్టాల ద్వారా కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు.



గ్రామసభ తీర్మానం లేకుండా పనులు ఎలా చేపడతారు?
పీసా చట్ట నిబంధనలకు అనుగుణంగా గ్రామసభ తీర్మానం లేకుండా ఏజెన్సీ ప్రాంతాల్లో ఎలాంటి కాంట్రాక్టు పనులను ప్రారంభించకూడదని ూచీూ నాయకులు విజ్ఞప్తి చేశారు. గిరిజన గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో గ్రామసభల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆదివాసీల భాగస్వామ్యంతోనే పనులు చేపట్టాలని కోరారు. గ్రామసభల హక్కులను విస్మరించకుండా, చట్టబద్ధమైన విధానాలను పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల భూములు, హక్కులు, స్వపరిపాలన పరిరక్షణే లక్ష్యంగా ూచీూ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం, 1/70 చట్టం అమలు, పీసా గ్రామసభల అధికారాల పరిరక్షణపై అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ూచీూ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ కుమార్, తల్లాడి ప్రసాద్, మహేష్, తల్లండి సంతోష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కఠిన సేవా పథకం అందుకున్న సీఐకు సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



పినపాక ,అక్టోబర్ 12(భద్రాద్రి న్యూస్): మండల పరిధిలోని ఏదుళ్ల బయ్యారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా సేవలు అందిస్తున్న (సి. ఐ)వెంకటేశ్వరరావు కఠిన సేవా పథకం అందుకున్న సందర్భంగా పినపాక సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు సీఐ వెంకటేశ్వరరావుకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందిస్తూ కఠిన సేవా పథకాన్ని అందుకున్న ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పినపాక సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంపెల్లి సంతోష్, గౌరవ అధ్యక్షులు నిట్టా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు గోడిశాల యోగి, తదితరులు పాల్గొని సీఐ వెంకటేశ్వరరావును అభినందించారు.

మహిళల హక్కులు, భద్రత కోసం ఐక్యంగా పోరాడాలి

- ఐద్వా ఆధ్వర్యంలో మాణిక్యారంలో బతుకమ్మ సంబరాలు





కారేపల్లి, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్ రాములు): మహిళల స్వేచ్ఛ, సమానత్వం, భద్రత కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి పిలుపునిచ్చారు. సోమవారం మాణిక్యారం గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలవడమే కాకుండా మహిళల ఆత్మగౌరవాన్ని చాటిచెబుతుందని అన్నారు. ఆడపిల్లలను పుట్టనివ్వాలి, చదివించాలి, స్వేచ్ఛగా ఎదిగేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, వివక్షకు వ్యతిరేకంగా మహిళలంతా సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలపై దాడులను అరికట్టేందుకు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, వారి భద్రతకు ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కోరారు. మహిళలను ఓటు బ్యాంకుగా చూడకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి రంగాలతో పాటు చట్టసభల్లోనూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ కూడలిలో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతర్ల సునీత, అజ్మీర జ్యోతి, బుసరాజు నాగమణి, మేకల స్వరూప, గడ్డిబోయిన సుభద్ర, వేపాకుల సుగుణమ్మ, సాయమ్మ, వీరమ్మ, పద్మ, రమ్య, సింధు, భవాని, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లిలో మీరా ఫోమ్ వాష్ సెంటర్ ప్రారంభించిన సర్పంచ్ టోనీ

- కార్లు, బైకులు సహా ఇతర వాహనాలకు ఫోమ్ వాష్ సేవలు..
ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించిన నిర్వాహకుడు సలీం పాషా

కారేపల్లి, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్ రాములు) : కారేపల్లి మెయిన్ రోడ్డులోని ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో షేక్ సలీం పాషా నూతనంగా ఏర్పాటు చేసిన మీరా ఫోమ్ వాష్ కార్ సర్వీసింగ్ సెంటర్‌ను కారేపల్లి గ్రామ సర్పంచ్ మేదరి టోనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ టోనీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, నూతన సర్వీసింగ్ సెంటర్‌ను ప్రారంభించి నిర్వాహకుడు షేక్ సలీం పాషాకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సర్వీసింగ్ సెంటర్‌లో కార్లు, బైకులు సహా ఇతర రకాల వాహనాలకు ఫోమ్ వాష్ సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకుడు సలీం పాషా తెలిపారు. వాహనదారులకు అందుబాటు ప్రాంతంలో నాణ్యమైన వాషింగ్ సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ముఖ్య అతిథులకు ఘన సన్మానం
ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ, మాజీ వైస్ ఎంపీపీ కొండబోయిన నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్, సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబులను సెంటర్ నిర్వాహకుడు షేక్ సలీం పాషా ఘనంగా సత్కరించి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమానికి విచ్చేసి నూతన వ్యాపారాన్ని ప్రారంభించినందుకు ముఖ్య అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ టోనీతో పాటు ఇతర ప్రముఖులు సలీం పాషాకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మీరా ఫోమ్ వాష్ సర్వీసింగ్ సెంటర్ విజయవంతంగా కొనసాగాలని, వాహనదారులకు మెరుగైన సేవలు అందిస్తూ వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బైక్, ఆటో మెకానిక్‌లు, మొబైల్ షాప్ యజమానులు, ఇతర వ్యాపార ప్రముఖులు పాల్గొని నిర్వాహకుడు సలీం పాషాకు శుభాకాంక్షలు తెలిపారు.



www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
మంగళవారం
13 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

గుండాల మండల సమస్యలు పరిష్కరించాలి!



- ప్రజా సమస్యలపై ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు నవచైతన్య యూత్ పోస్ట్‌కార్డులు
- మండల కేంద్రంలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేయాలి..
వైద్యం, విద్య, రవాణా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి

గుండాల, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్): పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన గుండాల మండలంలో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని నవచైతన్య యూత్ సభ్యులు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు పోస్ట్‌కార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. వైద్యం, విద్య, రవాణా, వ్యవసాయం, రెవెన్యూ తదితర రంగాల్లో నెలకొన్న సమస్యలను తమ విజ్ఞప్తిలో ప్రస్తావించారు.

వైద్య సదుపాయాలు మెరుగుపరచాలి:
గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఇద్దరు వైద్యులను నియమించాలని కోరారు. మండలంలో పోస్టుమార్టం మార్చురీ సౌకర్యం లేక మృతదేహాలను ఇల్లందుకు తరలించాల్సి వస్తోందని, ప్రయాణ సమయం కారణంగా మృతదేహాలు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గుండాలలోనే పోస్టుమార్టం మార్చురీ ఏర్పాటు చేయాలని, డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని, చెట్టుపల్లి, కాచనపల్లి గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

బస్సులు, బస్టాండ్ సౌకర్యం కల్పించాలి :
మండలం ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ గుండాల మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోజుకు సుమారు వెయ్యి మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో బస్టాండ్ నిర్మించాలని కోరారు. గుండాల నుంచి అనంతోగు మీదుగా కొత్తగూడెంకు బస్సు సౌకర్యం కల్పించాలని, గుండాల నుంచి ములుగు మీదుగా హనుమకొండకు ఎక్స్‌ప్రెస్ బస్సు నడపాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ప్రయాణికులకు సౌకర్యం కలగడంతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు రవాణా అనుసంధానం మెరుగుపడుతుందని తెలిపారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి :
మండలంలో సుమారు 1,500 మందికి పైగా గ్రాడ్యుయేట్లు ఉన్నప్పటికీ గ్రంథాలయ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువత కోసం గ్రంథాలయాన్ని మంజూరు చేయాలని కోరారు. టి.టి.డబ్ల్యూ.ఆర్.జె.సి.లో హెచ్ఈసీ గ్రూపును ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అసంపూర్తిగా ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయడంతోపాటు చిన్న వెంకటాపురం పరిధిలోని మల్లెల గుంపులో పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపాలి:
గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ కారణంగా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని నవచైతన్య యూత్ సభ్యులు పేర్కొన్నారు. రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాల్లో పూర్తిస్థాయిలో సర్వే నంబర్లు నమోదు కాకపోవడం, పాత పట్టాలున్న కొందరు రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు అందకపోవడం, భూమి సాగులో ఒకరు ఉండగా పట్టాలో మరొకరి పేరు నమోదవడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే అనేక పోడు భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు కాలేదని, దరఖాస్తు చేసుకున్న భూముల్లో కొంత భాగానికే పట్టాలు రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా గిరిజనులతో కలిసి జీవిస్తున్న దళిత కుటుంబాలకు భూములపై హక్కులు లేక రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల ప్రయోజనాలు అందకపోవడంతోపాటు ఎరువులు కొనుగోలు చేయడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వారి భూ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

రైతులకు మార్కెట్ సౌకర్యాలు కల్పించాలి
మండలంలో గిరిజన రైతులకు ఉపయోగపడేలా చింతపండు గ్రేడింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేసి, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గుండాల మండలంలోని సమస్యలను ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలనే ఉద్దేశంతో పోస్ట్‌కార్డు కార్యక్రమాన్ని చేపట్టినట్లు నవచైతన్య యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆజాద్, వినయ్, ముఖేష్, సంతోష్, శోభన్, ప్రతాప్, రోషన్, రవివర్మ, రాజేష్, చరణ్, దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

పూల జాతరలో ఆడబిడ్డల ఆటపాటలు..
అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!

- అయ్యవారిపేటలో కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు..
రంగురంగుల పూలతో బతుకమ్మల పేర్పు..
కోలాటాలు, నృత్యాలతో మహిళల సందడి..
మహిళలకు గులాబీ మొక్కల పంపిణీ!





వాజేడు, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) :
తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు వాజేడు మండల కేంద్రంలోని అయ్యవారిపేట గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగాయి. కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలంతా ఒక్కచోట చేరి బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు. పల్లె వాతావరణం పూల పరిమళంతో పరవశించగా.. మహిళల ఆటపాటలు, కోలాటాలు, నృత్యాలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది.

పూల పేర్పులో అందం.. ఆటపాటల్లో ఆనందం!
వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. స్పీకర్లలో వినిపించిన పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. రోజువారీ పనులు, బాధ్యతలతో తీరిక లేకుండా గడిపే మహిళలకు ఈ వేడుకలు సంతోషాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందించాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, సమష్టిగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత పండుగలా మార్చారు.

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలి..
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాపేడు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లుర్దు రాజు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీక అని వివరించారు. తరతరాలుగా వస్తున్న ఈ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. మహిళలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ, తమ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు.

ఆడబిడ్డలకు గులాబీ మొక్కల పంపిణీ.. పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సాహం!
బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని కార్యక్రమంలో పాల్గొన్న మహిళలందరికీ గులాబీ మొక్కలను పంపిణీ చేశారు. పూల పండుగను మొక్కల పంపిణీతో ముడిపెట్టడం ద్వారా ప్రకృతి పట్ల ప్రేమను, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెప్పారు. మహిళలు తమ ఇళ్ల వద్ద మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ప్రోత్సహించారు.

సంప్రదాయబద్ధంగా బతుకమ్మల నిమజ్జనం..
ఆటపాటలు, కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహంగా సాగిన వేడుకల అనంతరం మహిళలంతా కలిసి సమీపంలోని కుంటలో బతుకమ్మలను సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. పండుగ ప్రాధాన్యతను, బతుకమ్మ ఆచార వ్యవహారాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వాజేడు మండల యానిమేటర్లు, మండల కోఆర్డినేటర్, మహిళా సంఘాల సభ్యులు, కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు. పూలను పేర్చి బతుకమ్మను తీర్చిదిద్దిన ఆడబిడ్డలు.. ఆటపాటలతో పల్లెకు పండుగ కళను తీసుకొచ్చారు. సంప్రదాయాన్ని కాపాడుకుంటూ, ఐకమత్యాన్ని చాటుతూ, ఆనందాన్ని అందరితో పంచుకుంటూ సాగిన ఈ వేడుకలు మహిళల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి.

ఇసుక లారీలను ఆపండి.. రోడ్లు వేయండి!

- భద్రాచలం--వెంకటాపురం రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ఇసుక లారీలను నిలిపివేయాలని బీఆర్ఎస్ డిమాండ్
- లారీలు, దుమ్ము ధూళితో ప్రజలకు అవస్థలు..
ప్రమాదాలతో ప్రాణాలకు ముప్పు.. రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలని డిమాండ్

చర్ల, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్): రోడ్లు వేయకుండా ఇసుక లారీలను ఎలా నడుపుతారు? ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే రవాణాను ఇంకెంతకాలం కొనసాగిస్తారు? అంటూ బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు గళమెత్తారు. భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ఇసుక లారీల రాకపోకలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు, భద్రాచలం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జి మానే రామకృష్ణ సూచనలతో మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేపట్టారు.

ఇసుక లారీలతో ప్రాణాలకు ముప్పు
ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ.. భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రహదారి పరిస్థితి అధ్వానంగా ఉన్నప్పటికీ ఇసుక లారీల రాకపోకలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని విమర్శించారు. భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని, ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కారణంగా రహదారులపై ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దుమ్ము వల్ల అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటూ అనేకమంది అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా రహదారులు నిర్మించాలి.. ఆ తర్వాతే ఇసుక రవాణాపై నిర్ణయం తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఇసుక రవాణా కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ప్రజా పాలన అంటే ఇదేనా?
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ, భద్రాచలం నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదని దొడ్డి తాతారావు విమర్శించారు. ప్రజా పాలన ఎలా ఉందో తెలుసుకోవాలంటే భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు ప్రయాణిస్తే సరిపోతుందని వ్యాఖ్యానించారు. ప్రజలకు సురక్షితమైన రహదారులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఈ ప్రాంత ప్రజల కష్టాలను ప్రభుత్వం ఇకనైనా గుర్తించాలని కోరారు. రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి, అప్పటివరకు ఇసుక లారీల రాకపోకలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు 24 గంటల విద్యుత్ ఎక్కడ?
రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ.. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆరోపించారు. విద్యుత్ సరఫరా



సక్రమంగా లేక, సాగునీరు అందక పంటలు పండుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు నిరంతర విద్యుత్ సరఫరా అందించి, వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం అని దొడ్డి తాతారావు హెచ్చరించారు. రహదారి నిర్మాణం, ఇసుక లారీల నియంత్రణ, రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా వంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

ధర్నాలో పాల్గొన్న నాయకులు
ఈ మహా ధర్నాలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లబ్బాయి, అంబోజి సతీష్, కుప్పాల నిరంజన్, కనుకు భద్రం, పలక రమేష్, రావుల కిషోర్, మామిడి రాజు, ఎడ్ల రామదాసు, కట్టం కన్నారావు, పాసిగంటి సంతోష్, గాదంశెట్టి కిషోర్, మెంతుల నాగరాజు, రాట్నాల శ్రీరామ్మూర్తి, కొంగూరి సోమరాజు, బట్ట కొమరయ్య, గుమ్మల నరేంద్ర, ఎలకం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశ్వామిత్ర సేవలు అభినందనీయం

- కొత్తగూడెం 1వ టౌన్ సీఐ జితేందర్

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) : ఎనిమిదేళ్ల వయసులోనే పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వనజీవి విశ్వామిత్ర చౌహాన్ సేవలు అభినందనీయమని కొత్తగూడెం 1వ టౌన్ సీఐ జితేందర్ అన్నారు. వాక్ ఫర్ ట్రీస్ యజ్ఞంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐతో కలిసి విశ్వామిత్ర తన 1,593వ మొక్కగా పింక్ పనస మొక్కను నాటాడు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో విశ్వామిత్ర కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. విశ్వామిత్ర మాట్లాడుతూ "అమ్మ అంటే ప్రకృతి.. ప్రకృతిని కాపాడితే అమ్మ మనల్ని కాపాడుతుంది అన్నారు.



467 సీసీ టీవీ కెమెరాలతో పటిష్టమైన నిఘా వ్యవస్థ

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- చుంచుపల్లి పీఎస్‌లో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఎస్పీ రోహిత్ రాజు సోమవారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన మొత్తం 467 సీసీ టీవీ కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానం చేశారు. వీటి ద్వారా ఆయా ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించడం, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, నేరాల నియంత్రణతో పాటు అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించడం సులభతరం కానుంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. పోలీసు సేవలను మెరుగుపరిచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ద్వితీయ స్థానం

- సత్తా చాటిన అండర్-13 బాలికల జట్టు



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అండర్-13 బాలికల సాఫ్ట్ బాల్ జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ద్వితీయ స్థానం సాధించింది. నిజామాబాద్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర అండర్-13 బాలికల మినీ సబ్ జూనియర్ అంతర్‌జిల్లాల సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచి గర్వకారణంగా నిలిచింది. ఈ పోటీల్లో బాలికల పట్టుదల, క్రీడా స్ఫూర్తి, సమష్టి కృషితో అద్భుత ప్రతిభ కనబరిచారు. క్రీడాకారిణుల కఠోర శ్రమతో పాటు భద్రాద్రి కొత్తగూడెం కోచ్ పొన్నవల పృథ్వీరాజ్ శిక్షణ, జట్టు సమన్వయం ఈ విజయానికి దోహదపడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించడంపై తెలంగాణ సాఫ్ట్ బాల్ కార్యదర్శి కె.నవీన్ కుమార్, భారత సాఫ్ట్ బాల్ జాయింట్ సెక్రటరీ కె.శోభన్‌బాబు, నిజామాబాద్ సాఫ్ట్ బాల్ కార్యదర్శి గంగామోహన్ హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా జట్టు సాధించిన ఈ విజయం ఇతర క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ అభినందించారు.

కొత్తగూడెం 1వ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ సముద్రాల జితేందర్ కు హృదయపూర్వాక శుభాకాంక్షలు

- భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్
- నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శాలువా కప్పి సత్కారం



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12 (భద్రాద్రి న్యూస్) : కొత్తగూడెం 1వ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ సముద్రాల జితేందర్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు, ఈ సందర్భంగా సిఐ సముద్రాల జితేందర్ కు పుష్ప గుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నోముల రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కళ్యాణ్ కర్ రాజశేఖర్, ఓబీసీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, రాజేష్ మరియు మహిళ మోర్చా బొందుగుల. యామిని, భూక్యా పూర్ణ పట్టణ నాయకులు పాల్గొన్నారు.